క్లుప్తంగా

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి

కడప ఎడ్యుకేషన్: జనవరి 7,8 తేదీల్లో కడప నగరం వేదికగా జరిగే రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యు) 9వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ కోరారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను సోమవారం కడపలోని శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్‌రెడ్డి చేతుల మీదుగా ఆర్ఎస్‌యూ నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నకేశవరెడ్డి, నగర అధ్యక్షులు హరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీలు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలంటూ అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కడప నగరంలోని రాజీవ్ పార్క్ కట్ట వద్ద భారీగా మానవహారం నిర్మించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు సీఐటీయూ, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకురాళ్లు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలని ర్యాలీ

కమలాపురం : వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ పెంచాలని అంగన్‌వాడీలు ర్యాలీ చేపట్టారు. అలాగే మానవహారం ఏర్పాటు చేశారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో క్రాస్ రోడ్డు నుంచి ప్రాజెక్ట్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించగా, సీఐటీయూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. అలాగే ప్రాజెక్ట్ పరిధిలోని అంగన్‌వాడీలు నల్లదుస్తులు ధరించి తమ నిరసన వ్యక్తం చేశారు.

వైఎస్సార్ బీమా అందజేత

చెన్నూరు : స్థానిక అరుంధతినగర్‌కు చెందిన చెప్పలి నాగార్జున(36) ఇటీవల మరణించారు. వీరి కుటుంబానికి వైఎస్సార్ జీవిత బీమా వర్తించడంతో బీమా పథకంలో భాగంగా వారి కుటుంబానికి తక్షణ సహాయం కింద రూ.10 వేలను సోమవారం ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, సర్పంచ్ వెంకటసుబ్బయ్య అందజేశారు. కార్యక్రమంలో మూడవ సచివాలయం వెల్ఫేర్ సెక్రటరీ చైతన్య, సచివాలయం కన్వీనర్ సుధాకర్, వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ మండల కన్వీనర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భారతి సిమెంట్ వారి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మాజీ ఎంపీపీ సాదుం పద్మలత తెలిపారు. ఈ వైద్య శిబిరం ఉదయం నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉంటుందని ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, ఆపరేషన్ అవసరమైతే ఉచితంగా చేస్తారని ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులకు అభినందనలు

చెన్నూరు : ఈనెల 14, 15 తేదీలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కౌశల్ పరీక్షలో జిల్లాస్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులను సోమవారం ఎంఈఓ గంగిరెడ్డి ప్రజాప్రతినిధులు అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ గంగిరెడ్డి మాట్లాడుతూ ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కౌశల్ పరీక్ష లో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు మొదటి ర్యాంకు సాధించడం అభినందనీయమన్నారు. ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ మాట్లాడుతూ మన విద్యార్థులు కౌశల్ పరీక్ష నందు జిల్లా మొదటి ర్యాంకు సాధించడం ఎంతో అభినందనీయమన్నారు. ప్రధానోపాధ్యాయురాలు రత్నాదేవి మాట్లాడుతూ 8వ తరగతి నాగతేజశ్రీ వర్మ, 9వ తరగతి వర్షిని, పదవ తరగతి నిర్మల టీమ్ పాల్గొనగా వీరికి కోఆర్డినేటర్‌గా వీరశేఖర్ తమ సహాయ సహకారాలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సునీత, ఎంఆర్సీ సిబ్బంది ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ పేదలకు వరం

చెన్నూరు : పేద ప్రజలకు ఆరోగ్యశ్రీ సంజీవిని లాంటిదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్‌లు తెలిపారు. సోమవారం ఆరోగ్యశ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచిన సందర్భంగా వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని చేపట్టిన ముఖ్యమంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ యరసాని నిరంజన్‌రెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు టీఎస్ చంద్రారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల ఎస్టీ సెల్ శ్రీనివాససులు, మండల వైద్యాధికారులు, అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌కు క్రిస్మస్ కళ


నగరంలో విక్రయాలకు సిద్ధంగా ఉన్న క్రిస్మస్ సామగ్రి


ఆకట్టుకుంటున్న వివిధ రకాల స్టార్లు

కడప కల్చరల్ : క్రిస్మస్ పండుగకు ఇక ఆరు రోజులే గడువుంది. ఈ సందర్భంగా క్రిస్మస్ కొనుగోళ్లతో కడప మార్కెట్ కళకళలాడుతోంది. పెద్ద పండుగైన క్రిస్మస్‌తోపాటు నూతన సంవత్సరం, సంక్రాంతి లాంటి పండుగలు కూడా ఉండడంతో వ్యాపారులు వీటిపై పెద్దగా ఆశలు పెంచుకున్నారు. సాధారణంగా పండుగ వ్యాపారంలో భాగంగా వస్త్రాలు, పాదరక్షలు, ఫ్యాన్సీ వస్తువులు, గృహోపకరణాలు, గిఫ్ట్ ఆర్టికల్స్ ఎక్కువగా కొంటారు. అంతకంటే ముఖ్యంగా ఈ పండుగకు అవసరమైన సరంజామాను ఇష్టంగా కొంటారు. ఇందులో క్రిస్మస్ స్టార్లు, క్రిస్మస్ చెట్లు, గంటలు, పిల్లలకు క్రిస్మస్ తాత దుస్తులు, మాస్కులు, ఇంటి అలంకరణకు సీరియల్ సెట్లు తదితరాలు తప్పక కొంటారని, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం వ్యాపారం బాగా జరుగుతుందన్న ఆశ దుకాణదారుల్లో ఉంది. అందుకే పెద్ద మొత్తాలు వెచ్చించి భారీగా క్రిస్మస్ సామాగ్రిని తెప్పించి ప్రజలకు అందుబాటులో ఉంచారు. ఈ నాలుగు రోజుల్లో ఒక్కో దుకాణంలో క్రిస్మస్ సామాగ్రి రోజూ రూ. 50 వేలకుపైగా వ్యాపారం జరుగుతుందని ఆశిస్తున్నారు.

కళకళలాడుతూ...

వ్యాపారులు ఈ క్రిస్మస్ కోసం ఆకర్షణీయమైన సామాగ్రిని అందుబాటులో ఉంచారు. వాటిలో బెలూన్ లైట్, గ్లాస్ స్టార్‌లు, శ్యాండ్లియర్లు, మల్టీకలర్‌స్టార్లు ఆకట్టుకుంటున్నాయి. పలురకాల క్రిస్మస్ ట్రీలు, క్రీస్తు జననం పాక దృశ్యాల బొమ్మల సెట్లు ఆకర్శిస్తున్నాయి. క్రిస్మస్ స్టార్లు రూ. 50-800, క్రిస్మస్ ట్రీలు రూ. 100-2000, అలంకార సామాగ్రి రూ. 25-500 వరకు, క్రిస్మస్ తాత డ్రస్ రూ. 200-600, మాస్క్ రూ.50-150లకు, సీరియల్ సెట్లు రూ. 80-300 వరకు విక్రయిస్తున్నారు.

ఫైబర్ తారలు ..

ఇన్నాళ్లు మనం చూస్తున్న తారలకు భిన్నంగా ఫైబర్ తారలు మార్కెట్‌లోకి అందుబాటులోకి వచ్చాయి. ఫైబర్‌తో బాడీ రూపొందించిన ఈ తారలు విద్యుత్‌తో పలు రంగులు వెదజల్లుతాయి. సాధారణ స్టార్స్‌తో పోలిస్తే చాలా పలుచగా, తేలికగా ఉండడంతో ఈసారి వ్యాపారం జోరుగా సాగుతోంది. కొనుగోలు దారులు ఈ తారలను దుకాణాల్లోనే పరిశీలించి మరీ కొంటున్నారు.

రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీలో ప్రతిభ


ప్రథమ బహుమతిని సాధించిన రోహన్


ప్రథమ బహుమతిని సాధించిన సుభాస్


ద్వితీయ బహుమతిని సాధించిన ప్రదీప్

కడప ఎడ్యుకేషన్: ఒంగోలు నగరంలోని ఈ నెల 17వ తేదీన చిన్మయా మిషన్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీల్లో కడప ఎర్రముక్కపల్లె బాలవికాస్ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతభను ప్రదర్శించి రాష్ట్రస్థాయి అవార్డులను గెలుచుకున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ సుబ్బరాయుడు, డైరెక్టర్ గంగయ్యలు తెలిపారు. ప్రీప్రైమరీ విభాగంలో యూకేజీ విద్యార్థి రోహన్ క్రిష్ణ, 4వ తరగతికి చెందిన వైఎస్ సుభాష్‌ప్రతిమన్ రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతులను గెలుపొందారని తెలిపారు. ఇందుకుగాను ఒకొక్కరికి రూ. 10 వేల నగదుతోపాటు మెమెంటో, మెరిట్ సర్టిఫికెట్, మెడల్‌ను బహూకరించారు. 9వ తరగతికి చెందిన ప్రదీప్‌కుమార్ రాష్ట్రస్థాయి ద్వితీయ బహుమతిగా రూ.8 వేలు నగదుతోపాటు మెమెంటో, ప్రశంసాపత్రం దక్కించుకున్నాడు. ఈ విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ , కరస్పాండెంట్, ఉపాధ్యాయులు అభినందించారు.

గణపతికి రుద్రాభిషేకం

రాయచోటి టౌన్ : శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో వెలసిన శ్రీ విఘ్నేశ్వరుడికి రుద్రాభిషేకం నిర్వహించారు. సోమవారం స్వామి వారికి ఆలయ పాలకమండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పోలంరెడ్డి దశరథరామిరెడ్డిల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు మల్లికార్జున స్వామి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని పూలు, ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించారు. స్వామిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

నందలూరు(రాజంపేట) : నందలూరు పోలీస్‌స్టేషన్‌ను సోమవారం రాజంపేట డీఎస్పీ వీఎన్‌కే చైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ముందుగా స్టేషన్‌లోని పరిసరాలను, ఖైదీల గదిని, సీసీ కెమెరాల పనితీరును తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ (నవీకరణ) చేయాలని సూచించారు. స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం పోలీసు సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రాజంపేట రూరల్ సీఐ మంజునాథరెడ్డి, స్థానిక ఎస్ఐ అబ్దుల్ జహీర్, పోలీసులు దర్బార్ బాషా, శ్రీను, రామకృష్ణ, మేరీలు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట


డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేసి ప్రతి పథకాన్ని వారి పేరునే అందించడం జరుగుతోందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష తెలిపారు. సోమవారం స్థానిక 26వ డివిజన్ మాసాపేట పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంజద్‌బాష మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరునే అందిస్తున్నామన్నారు. కుటుంబాలు బాగుపడాలంటే మహిళలు ఆర్థిక సాధికారత సాధించాలని తెలిపారు. రైతు భరోసా, ఉచిత పంటల బీమా, ఆరోగ్యశ్రీ, ఫ్యామిలీ డాక్టర్, నాడు-నేడు, ఫీజు రీఎంబర్స్‌మెంట్, అమ్మ ఒడి, వైఎస్సార్ ఆసరా, చేయూత, పెన్షన్ కానుక వంటి పథకాలను ప్రవేశపెట్టి పేద ప్రజలకు మేలు చేశారన్నారు. ఏపీ ప్రభుత్వ విధానాలను దేశంలోనే అన్ని రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. పేదల జీవితాలు బాగుపడేవరకు సీఎం కృషి కొనసాగుతూనే ఉంటుందన్నారు. కరోనా సమయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన కృషిని దేశ యావత్తు ప్రశంసించిందని గుర్తు చేశారు. అంతకుముందు ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ క్యాలెండర్‌ను ఆవిష్కరించి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్‌కుమార్, 26వ డివిజన్ కార్పొరేటర్ నాగమణి, ఇన్‌ఛార్జి త్యాగరాజు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు సీహెచ్ వినోద్, పార్టీ నాయకులు షఫీ, మల్లికార్జున, చెన్నయ్య, సుబ్బారెడ్డి, తోటకృష్ణ, చైతన్య, సంపత్, నాగేంద్రబాబు, రామ్మోహన్‌రెడ్డి, గౌస్‌పీర్ పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రంలో అభివృద్ధి


సంక్షేమ పథకాలను వివరిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష తెలిపారు. సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా 34వ డివిజన్‌లోని కుమ్మరికుంట, టుటౌన్ పోలీసుస్టేషన్ పరిధిలో ఉప ముఖ్యమంత్రి ఇంటింటికి వెళ్లి గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని వివరించారు. ప్రభుత్వ సంక్షేమాలను తెలిపి ఏయే సంక్షేమ పథకాలవల్ల వారికి లబ్ధి చేకూరిందో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా షేక్ షాహీన్‌భాను అనే మహిళ మాట్లాడుతూ తమ కుటుంబానికి జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ పింఛన్ కానుక, జగనన్న అమ్మ ఒడి, విద్యా దీవెన పథకాల ద్వారా రూ. 10.86 లక్షల మేలు జరిగిందని సంతోషం వ్యక్తం చేశారు. షేక్ మహబూబ్‌బాష అనే వ్యక్తి మాట్లాడుతూ తమకు ఇంటి స్థలం, ఇంటిని నిర్మించుకునేందుకు నగదు, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ పింఛన్ కానుక పథకాల ద్వారా రూ. 9.51 లక్షల లబ్ధి చేకూరిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, 34వ డివిజన్ ఇన్‌ఛార్జి ఎ.అలీ, వైఎస్సార్‌సీపీ నాయకులు బంగారు నాగయ్య యాదవ్, సుబ్బారెడ్డి, పవర్ అల్తాఫ్, రామ్మోహన్‌రెడ్డి, పస్తం అంజి, వేణుగోపాల్‌నాయక్, గౌస్‌పీర్, బండి మరియలు, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


మారుతినగర్‌లో సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కడప కల్చరల్ : శ్రీ సుబ్రమణ్యషష్ఠిని పురస్కరించుకుని సోమవారం కడప నగరంలోని పలు సుబ్రమణ్యస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. స్థానిక మారుతినగర్‌లోని శ్రీ మహా సరస్వతిదేవి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు.

– నగరంలోని శ్రీనగర్ కాలనీలో వెలసిన రామాలయంలో శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

– కలెక్టరేట్ వద్దగల మహావీర్ సర్కిల్ సమీపంలోని నాగులకట్ట మందిరం వద్ద సుబ్రమణ్యషష్ఠి సందర్భంగా శ్రీ వల్లి దేవసేన సమేత స్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.

వెలుగు వైపు నడిపించే దేవుడు క్రీస్తు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

కడప కల్చరల్ : ప్రభువైన ఏసుక్రీస్తు పాపులను వెలుగు వైపు నడిపించే దేవుడని హైదరాబాదుకు చెందిన పాస్టర్ ఆర్‌పీ దాస్ అన్నారు. సోమవారం స్థానిక తెలుగుగంగ కాలనీలోని హోలి జియోన్ చర్చిలో పాస్టర్ పి.బెంజిమన్, సిస్టర్ దీనరాణిల ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పాస్టర్ ఆర్‌పీ దాస్, న్యూనేటివ్ కృపా మినిస్ట్రీస్ దైవ జనులు పాస్టర్ పి.మహేష్ మాట్లాడుతూ మానవులు తమ పాపాలను ప్రక్షాళన చేసుకునేందుకు క్రిస్మస్ పండుగ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం విశ్వాసులచే సామూహిక ప్రార్థనలు చేయించారు. కార్యక్రమంలో పాస్టర్లు ఇజ్రాయిల్, ఎస్.జాకబ్, ఎస్.మోషె, డి.అమర్ పాల్గొన్నారు.

పెన్షనర్లు సమాజానికి మార్గదర్శకులు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకటరమణ

– ఆర్డీఓ ఆకులవెంకటరమణ

బద్వేలు అర్బన్ : నేటి సమాజానికి వృద్ధులు, విశ్రాంత ఉద్యోగులు, వారి అనుభవాలు ఎంతో మార్గదర్శకమని ఆర్డీఓ ఆకుల వెంకటరమణ పేర్కొన్నారు. జాతీయ పెన్షనర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఎన్‌జీఓ హోంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పెన్షనర్లు అందరూ ఒక సంఘాన్ని ఏర్పాటు చేసుకుని కష్టనష్టాలను కుటుంబంలా భరిస్తూ పరిష్కరించుకోవడం అభినందనీయమన్నారు. కుడా చైర్మన్ గురుమోహన్, మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డిలు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొని పదవీవిరమణ పొందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగులు ఐక్యంగా సంఘం ఏర్పాటు చేసుకుని ముందుకెళ్లడం అభినందనీయమన్నారు. అనంతరం 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న గానుగపెంట హనుమంతరావు తదితరులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్‌రెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ మీనాక్షిరెడ్డి, బ్రహ్మయ్య, ట్రెజరర్ గంగన్న, గౌరవాధ్యక్షులు పుల్లంరాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పిచ్చయ్య, లక్ష్మిరెడ్డి, రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిధ పంటల సాగుతో బహుళ ప్రయోజనం


ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న దృశ్యం

చిన్నమండెం : ఏటీఎం మోడల్ ఏ గ్రేడ్ మోడల్ వివిధ పంటలతో పది రోజుల నుంచి 20 సంవత్సరాలు వరకు పంటలు వచ్చే మొక్కలని ఒకే పొలంలో సాగు చేయడం వల్ల బహుళ ప్రయోజనం ఉంటుందని మండల సమాఖ్య అధ్యక్షురాలు రమణమ్మ పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లూరు, చిన్నమండెం, పడమటికోన గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ పొలాలను ఆమె సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే చేకూరే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి మహేశ్వరి, కోశాధికారి స్వాతి, ఏపీఎం రెడ్డమ్మ, సీసీలు నాగరాజు, రమణ, రెడ్డన్న, మండల పాయింట్ పర్సన్ సుబ్రమణ్యంఆచారి, మండల టీం లీడ్ చందురెడ్డి, మండల మాస్టర్ టైలర్స్ శ్రీనివాసులు, పద్మావతి, మోడల్ మేకర్స్ యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ఐసీఆర్పీలు, మహిళా సంఘ సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా రోడ్డు విస్తరణ పనులు


వేంపల్లెలో జరుగుతున్న రోడ్డు వెడల్పు నిర్మాణ పనులు

వేంపల్లె : పట్టణంలోని కడప, పులివెందుల, గండి రోడ్లలో 72 అడుగుల మేర రోడ్డు విస్తరణ చేయనున్నట్లు ఆర్అండ్‌బీ ఏఈ వెంకటరమణ సోమవారం తెలిపారు. అందుకు సంబంధించి ప్రభుత్వం రూ.50 కోట్ల నిధులు మంజూరు చేసిందన్నారు. రోడ్డుకు ఇరువైపులా నాలుగు అడుగుల మేర ఫుట్‌పాత్ నిర్మాణం, మధ్యలో డివైడర్, లైటింగ్ తదితర వాటిని ఏర్పాటు చేయనున్నామన్నాని ఆయన తెలిపారు. అలాగే రూ.92 కోట్లతో అండర్ డ్రైనేజీ పనులు కూడా జరుగుతున్నాయి. ఈ పనులను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆరు నెలల్లోపు ఈ పనులన్ని పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు.

టెంకాయల విక్రయానికి వేలంపాట


వేలం పాట నిర్వహిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

పెండ్లిమర్రి : పొలతల శైవక్షేత్రంలో మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో టెంకాయ విక్రయం, టోల్‌గేట్, కొబ్బరి చిప్పల సేకరణకు సోమవారం దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్థన్, ఆలయ చైర్మన్ నాగమల్లారెడ్డిల ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. తలనీలాల సేకరణ వేలం పాటకు ఎవరు రాకపోవడంతో వాయిదా వేశారు. టెంకాయ విక్రయానికి విడి దినాల్లో రూ.6.65 లక్షలు, తిరునాల మూడు రోజులు టెంకాయల విక్రయం వాయిదా వేశారు. టెంకాయ చిప్పల సేకరణకు రూ.5.41లక్షలు, విడి దినాల్లో టోల్ గేట్‌కు రూ.3.10 లక్షలు, మహాశివరాత్రి మూడు రోజులకు టోల్ గేట్ రూ.2 లక్షలు వేలం పాట ద్వారా దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పొలతల ఆలయ ఈఓ శ్రీనువాసులు, ఆలయ మాజీ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల హక్కులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

– జడ్జి బాబా ఫక్రుద్దీన్

కడప ఎడ్యుకేషన్: భారతదేశంలోని మైనారిటీ వర్గాల హక్కులను ప్రోత్సహించాలని ప్రతి ఏటా డిసెంబర్ 18న మైనారిటీ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పేర్కొన్నారు. మైనారిటీ హక్కుల దినోత్సవం సందర్భంగా సోమవారం కడప మున్సిపల్ కార్పొరేషన్ ఉర్దూ బాలుర హైస్కూల్‌లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మైనారిటీల శాతం దేశంలోని మొత్తం జనాభాలో 19.3 శాతం ఉందన్నారు. మైనారిటీలకు స్వేచ్ఛ , సమాన అవకాశాలను కల్పించాలన్నారు. అలాగే ఆ హక్కులపై వారు అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం పలు ఆర్టికల్స్, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శాంత, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ మనోహర్, హెడ్‌మాస్టర్ పుష్పలత, ఎస్టీయూ రాష్ట్ర మైనార్టీ నాయకులు ఇలియాష్‌బాష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.